సాక్షి తిరుపతి
శనివారం । 16 । మార్చి । 2024



కేంద్ర బలగాల ఫ్లాగ్ మార్చ్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కేంద్ర బలగాలు తిరుపతి నగరంలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. - 8లో



ద్విచక్రవాహనం బహూకరణ

తిరుమల శ్రీవారికి ఢిల్లీకి చెందిన హీరో మోటార్స్ నిర్వాహకులు ద్విచక్ర వాహనాన్ని బహూకరించారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం (సా)	సహర్ ఆదివారం (ఉ)
తిరుపతి	6-26	5-00
గూడూరు	6-25	4-53

న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షకు 843 మంది గైర్హాజరు

తిరుపతి ఎడ్యుకేషన్: ఇంటర్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శుక్రవారం ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కెమిస్ట్రి, కామర్స్, సోషియాలజీ, ఫైన్ ఆర్ట్స్, మ్యూజిక్ సబ్జెక్టుల్లో పరీక్ష జరిగింది. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 87 పరీక్షా కేంద్రాల్లో జనరల్‌లో 27,123 మంది, ఒకేషనల్‌లో 937 మంది, మొత్తం 28,060 మంది పరీక్షకు హాజరవ్వాల్సి ఉండగా.. జనరల్‌లో 707 మంది, ఒకేషనల్‌లో 136 మంది మొత్తం 843 మంది గైర్హాజరైనట్టు ఇంటర్ ఆర్ఐఓ జీవీ.ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఇంటర్ పరీక్షల్లో భాగంగా శనివారం 87 పరీక్షా కేంద్రాల్లో ప్రథమ సంవత్సర విద్యార్థులకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, లాజిక్ పేపర్, బ్రిడ్జి కోర్సు మ్యాథ్స్ (బైపీసీ వారికి) పరీక్షలు జరగనున్నట్టు ఆర్ఐఓ తెలిపారు.

18న వెంకటగిరిలో జాబ్ మేళా

తిరుపతి అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీన (సోమవారం) ఉదయం 9గంటల నుంచి వెంకటగిరిలోని వీఆర్‌జేసీ మహిళా డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ఆ సంస్థ జిల్లా అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. ఐదో తరగతి నుంచి పదో తరగతి లేదా ఇంటర్మీడియెట్ లేదా ఐటీఐ, డిప్లొమో, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పలు కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నట్టు వెల్లడించారు. ఆ మేరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. అదనపు సమాచారం కోసం డిస్ట్రిక్ట్ ప్లేస్మెంట్ ఆఫీసర్, గణేష్, 9505023016ను సంప్రదించాలని కోరారు.

రీసెట్ దరఖాస్తులకు 19న ఆఖరు

తిరుపతి సిటీ: ఏపీ రీసెట్-23 దరఖాస్తు గడువు ఈనెల 19వ తేదీతో ముగియనున్నట్లు కన్వీనర్ ప్రొఫెసర్ దేవ ప్రసాద్‌రాజు తెలిపారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న పీహెచ్‌డీ సీట్ల భర్తీకి చేపట్టిన ఏపీ రీసెట్-2023 దరఖాస్తు ఇప్పటికే నోటిఫికేషన్ విడుదల చేసినట్టు వెల్లడించారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వేసవిలో అదనపు సర్వీసులు



చెంగల్‌రెడ్డి, డీపీటీవో

తిరుపతి అర్బన్: వేసవి నేపథ్యంలో ఆర్టీసీ పలు మార్గాల్లో అదనపు సర్వీసులను ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో మాట్లాడుతూ రేణిగుంట-చంద్రగిరికి 10 సర్వీసులు, గ్రామీణ ప్రాంతాలకు 27 సర్వీసులు, 30 కొత్త హైయర్ బస్సులు, అరుణాచలంకు ఒక ఏసీ సర్వీస్, మధురైకి మరో ఏసీ సర్వీస్ ఈనెలలోనే ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఈనెల 18వ తేదీ నుంచి పదో తరగతి విద్యార్థులు హాల్ టిక్కెట్ చూపిస్తే ఉచితంగా పరీక్ష ప్రాంతానికి ఆర్టీసీ గ్రామీణ సర్వీసుల్లో ప్రయాణం చేయొచ్చని సూచించారు. వేసవి నేపథ్యంలో తిరుమలకు అదనపు సర్వీసులు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. మరోవైపు అన్ని బస్టాండ్లలో తాగునీటి సౌకర్యాలతోపాటు దాతల సాయంతో చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని నాలుగు జంబో కూలర్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని వెల్లడించారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

తిరుపతి అర్బన్: రైతులకు చిరుధాన్యాల సాగుపై అవగాహన కల్పిస్తూ వాటికి మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌ను తెలియజేయాలని కలెక్టర్ లక్ష్మీశ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయరంగాన్ని బాగా అభివృద్ధి చేయడానికి రైతులు తెలుగు గంగనీటిని సద్వినియోగం చేసుకునే దిశగా చర్యలుండాలని సూచించారు. మిచాంగ్ తుపాన్‌లో నష్టపోయిన రైతులకు 80శాతం రాయితీతో విత్తనాలు అందించాలన్నారు. ప్రధానంగా వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందిస్తున్న అన్ని సేవలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. సబ్సిడీ పనిముట్లు అవసరమైన రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. డీఏఓ ప్రసాద్‌రావు మాట్లాడుతూ రబీ 2023-24లో 73,534 మంది రైతులకు 2,02,909 ఎకరాలలో ఈ - క్రాప్ నమోదు పూర్తిచేశామన్నారు. రైతులకు అవసరమైన పురుగు మందులను ఇండెంట్ పెట్టిన 48 గంటల్లోపు సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు. 7,971 మంది కౌలు రైతులకు కార్డులు మంజూరు చేసినట్టు తెలిపారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, జిల్లా సిరికల్చర్ అధికారిణి గీతారాణి, మైక్రో ఇరిగేషన్‌శాఖ అధికారి సతీష్, మత్స్యశాఖ జిల్లా అధికారి నాగరాజు, వ్యవసాయశాఖ ఏడీఏ ధనంజయరెడ్డి పాల్గొన్నారు.

టికెట్ల లొల్లి.. నేతల వర్రీ!



ఉమ్మడి చిత్తూరు జిల్లాలో రాజకీయం రంజుగా మారింది. టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుల ఎత్తులకు ఆశావహులు చిత్తవుతున్నారు. పార్టీ జెండా మోసి మోసపోయామని కొందరు.. పార్టీ కార్యక్రమాలకు డబ్బులు తగలేసి అప్పుల పాలయ్యామని మరికొందరు రగిలిపోతున్నారు. అధికార పార్టీ ఛీకొట్టిన నేతకు టికెట్ ఎలా ఇస్తారని స్థానిక నేతలు నిలదీస్తున్నారు. స్థానికేతరులకు టికెట్ ఇచ్చి అవమానించారని ఇంకొందరు రుసరుసలాడుతున్నారు.



వరదయ్యపాళెం: నిరసన తెలుపుతున్న టీడీపీ నేతలు

- జెండా మోసిన వారు వద్దు.. కొత్త వారే ముద్దంటున్న అధినేతలు
- తిరుపతి, సత్యవేడు జనసేన, టీడీపీ అభ్యర్థుల ఎంపికపై ఆగ్రహ జ్వాలలు
- సత్యవేడులో టీడీపీ శ్రేణుల తిరుగుబాటు
- ఆదిమూలాన్ని మార్చకపోతే టీడీపీకి ఓటమి తప్పదని హెచ్చరికలు
- తిరుపతి టీడీపీ, జనసేన వారికి చిత్తూరు శ్రేణులు చీర, గాజులు పంపుతామంటూ హేళన
- శ్రీకాళహస్తిలో జనసేన పార్టీ నేతలపై బొజ్జల సుధీర్ వర్గీయుల దాడి
- ఆందోళనకు సిద్ధమైన ఇరు పార్టీల శ్రేణులు

సాక్షి, తిరుపతి: టీడీపీ, జనసేనలో టికెట్ల లొల్లి రాజుకుంది. మొదటి నుంచి పార్టీ కోసం పనిచేస్తున్న వారిని పక్కనబెట్టి నిన్నగాక మొన్న పార్టీలో చేరిన వారికి, అసలు కండువానే కప్పుకోని వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటించడంపై ఆ పార్టీ శ్రేణులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఎమ్మెల్యే ఆదిమూలం టీడీపీ కండువా కప్పుకోకపోయినా చంద్రబాబు సత్యవేడు అభ్యర్థిగా ప్రకటించారు. చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలు పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు. టీడీపీ మాజీ ఇన్‌చార్జ్ జేడీ రాజశేఖర్ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తామని ప్రకటించారు. నియోజకవర్గానికి చెందిన టీడీపీ నాయకులంతా శుక్రవారం వరదయ్యపాళెం చేరుకుని నిరసన తెలియజేశారు. ఇసుక, గ్రావెల్ అక్రమంగా తరలించి అమ్ముకున్న ఆదిమూలంకి ఎలా టికెట్ ఇస్తారని చంద్రబాబుని ప్రశ్నించారు. మొన్నటి వరకు ఆదిమూలం అవినీతిపరుడని చెప్పిన తాము ఇప్పుడు కోనేటికి ఓటేయమని ఎలా అడగాలని నిలదీస్తున్నారు. స్థానిక ప్రజలకు సేవచేయడంలో విఫలమయ్యారని తెలుసుకున్నాకే ఆయన్ని వైఎస్సార్‌సీపీ అధిష్టానం పక్కనపెట్టిందని గుర్తుచేశారు. అటువంటి నేతను టీడీపీ అభ్యర్థిగా ఎలా నియమిస్తారని ఆ పార్టీ శ్రేణులు ధ్వజమెత్తారు. సత్యవేడు అభ్యర్థి తానేనని నాలుగేళ్లుగా ఖర్చు చేసుకుంటూ కార్యక్రమాలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే హేమలతి కుమార్తె డాక్టర్ హెలెన్ అయితే రెండు రోజులుగా నివాసానికే పరిమితమై బోరున విలపిస్తున్నట్లు సమాచారం. సత్యవేడు అసంతృప్తి నేతలంతా నేడు సమావేశం కానున్నట్టు తెలుస్తోంది. వీరితో పాటు శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, మునిరామయ్య ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు.

తిరుపతి నేతలకు తీవ్ర అవమానం

చిత్తూరుకు చెందిన ఆరణి శ్రీనివాసులు అనుచరులు తిరుపతి జనసేన నేతలను తీవ్రంగా అవమానించినట్లు తెలిసింది. జనసేనకు తిరుపతి అసెంబ్లీని కేటాయించినా.. పోటీ చేసేందుకు బలమైన నాయకులు లేరని, అందుకే చిత్తూరు నుంచి చీరలు, గాజులు పంపిస్తున్నామంటూ అవమానించారంటూ జనసేన నాయకుడు కిరణ్‌రాయల్ పార్టీ నాయకుల అంతర్గత సమావేశంలో వెల్లడించారు. ఈ విషయంపై తిరుపతికి చెందిన టీడీపీ, జనసేన శ్రేణులు భగ్గుమంటున్నారు. ఆరణి శ్రీనివాసులకు టికెట్ ఇస్తే పనిచేసేది లేదంటూ తీర్మానం చేసి ఆ లేఖను అమరావతికి పంపినట్లు తెలిసింది. అందులో భాగంగా శుక్రవారం ఉదయం ఓ కల్యాణ మండపంలో సమావేశం ఏర్పాటు చేశారు. సాయంత్రం తిరుపతి నగరంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టాలని నిర్ణయించారు. చివరకు అధిష్టానం తిరుపతి టీడీపీ, జనసేన నేతలకు సీరియస్ వార్నింగ్ ఇవ్వడంతో మిన్నకుండిపోయారు. ఆ వెంటనే సమావేశం, నిరసన ర్యాలీలు రద్దు చేసినట్లు ప్రకటించి ఆరణి శ్రీనివాసులు కోసం తామంతా కలిసి పనిచేస్తామని పసుపులేటి హరిప్రసాద్ ఓ వీడియో రిలీజ్ చేయడం గమనార్హం. మరో వైపు టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మకు చంద్రబాబు కనీసం అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదని సమాచారం. ఇంకా టికెట్ ఆశించిన తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్, ఊకా విజయకుమార్, జేబీ శ్రీనివాసులు చంద్రబాబు తీరుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

శ్రీకాళహస్తిలో జనసేన వర్సెస్ టీడీపీ

శ్రీకాళహస్తి టికెట్ బొజ్జల సుధీర్‌రెడ్డికి కేటాయించడంతో టీడీపీ శ్రేణులు గురువారం రాత్రి జనసేన కార్యాలయం ముందు బాణసంచా పేల్చి హంగామా చేశారు. జనసేన నాయకురాలు వినూత, అనుచరులను రెచ్చగొట్టేల వ్యవహరించారు. దీనిపై ప్రశ్నించడంతో బొజ్జల అనుచరులు జనసేన శ్రేణులపై దాడులకు తెగబడ్డారు. ఇంతజరిగినా అధిష్టానం నుంచి కనీసం పలకరింపు కూడా లేకపోవడంతో జనసేనకు రాజీనామా చేయనున్నట్లు శుక్రవారం ప్రకటించారు. ఇదిలా ఉంటే పొత్తులో భాగంగా శ్రీకాళహస్తి స్థానాన్ని బీజేపీకి కేటాయిస్తారని భావించి కోలా ఆనంద్ కొద్ది రోజులుగా ప్రచారం కూడా ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, మునిరామయ్య శ్రీకాళహస్తి నుంచి పోటీ చేయాలనే ఉద్దేశంతో టీడీపీలో చేరినా ప్రయోజనం లేకుండా పోయింది. వీరంతా నేడు వారి అనుచరులతో సమావేశం కానున్నారు.

నిరసన ర్యాలీ

శ్రీకాళహస్తి టికెట్ ఆశించి భంగపడ్డ జనసేన నాయకులు శుక్రవారం రాత్రి పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు.

యాదవులకు చుక్కెదురు

పొత్తులో భాగంగా పుంగనూరు నుంచి తానే పోటీలో ఉంటానని చిత్తూరు జిల్లా పుంగనూరుకు రామచంద్రయాదవ్ చెప్పుకుంటూ వచ్చారు. బీజేపీ నుంచి లేదా జనసేన అభ్యర్థి తనేనని ప్రకటించుకున్నారు. చివరకు టీడీపీ నాయకుడు చల్లా రామచంద్రారెడ్డినే ఖరారు చేయడంతో యాదవ్‌లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీసీవై పార్టీ పేరుతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయా లని నిర్ణయించుకున్నారు. ఇదిలా ఉంటే.. వెంకటగిరి టికెట్ ఈ సారి బీసీలకు కేటాయించాలని మస్తాన్‌యాదవ్, మరికొందరు చేనేత కార్మికులు ప్రయత్నాలు చేశారు. పలుమార్లు టీడీపీ అధినేత చంద్రబాబుని కలిసి విన్నవించారు. రా కదలి రా సమయంలో కూడా బీసీలంతా ఏకమై చంద్రబాబుని కలిసి విన్నవించారు. ఆ తరువాత కూడా సమావేశాలు ఏర్పాటు చేసి తీర్మానం చేసి, ఆ కాపీని టీడీపీ అధిష్టానానికి పంపారు. అయినా ప్రయోజనం లేదు. చివరకు చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ రెండో భార్య కుమార్తె లక్ష్మీసాయి ప్రియ పేరును ప్రకటించడంతో బీసీ సామాజిక వర్గానికి చెందిన వారంతా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని వెల్లడించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి డాలర్ దివాకర్‌రెడ్డి చంద్రగిరి నుంచి పోటీ చేయాలని గత కొంత కాలంగా బ్యానర్లు, ఫ్లెక్సీలతో హంగామా చేస్తూ వచ్చారు. తరుచూ ఆత్మీయ సమావేశాలు కూడా ఏర్పాటు చేసి నజరానాలు అందిస్తూ పలువురి దృష్టిలో పడేందుకు కిందామీదా పడ్డారు. చివరకు చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన పులివర్తి నానికి టికెట్ కేటాయించడంతో రెడ్డి సామాజికవర్గానికి చెందిన వారు ఆగ్రహంతో ఉన్నారు.

శాశ్వత చిరునవ్వు



ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

- ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ పూర్తి
- తిరుపతి రూరల్ మండలంలో 11,711 మంది లబ్ధిదారులు
- ప్రతిష్టాత్మకంగా నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం
- ప్రజా సంక్షేమానికి సంకల్పించే ప్రభుత్వాన్ని గెలిపించుకుందాం
- తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పిలుపు
- పండుగ వాతావరణంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాల పంపిణీ

తిరుపతి రూరల్: పేదవాడి సొంతింటి కల సాకారం దిశగా సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేశారని తుడా చైర్మన్, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. ప్రతిష్టాత్మకంగా నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం అమలవుతోందని స్పష్టం చేశారు. నిరుపేద ప్రజల సంక్షేమానికి అనేక పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చారని కొనియాడారు. శుక్రవారం పండుగ వాతావరణంలో.. తిరుపతి రూరల్ పరిధిలోని 11,711 మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ పత్రాలను తుడా చైర్మన్ పంపిణీ చేశారు. ఇందుకు తిరుపతి రూరల్ మండల కార్యాలయ ఆవరణంలోని సమావేశ మందిరం వేదికైంది. మండలంలోని పలు పంచాయతీల నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రిజిస్ట్రేషన్ పత్రాలు అందుకున్న మహిళలు చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో మధ్యాహ్నం మహిళలకు ఏర్పాటు చేసిన ఆత్మీయ విందులో వారితో కలిసి భోజనం చేశారు.

ప్రజాసంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపిద్దాం

అనంతరం మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజాసంక్షేమానికి సంకల్పించే ప్రభుత్వాన్ని గెలిపించుకుందామని మహిళలకు పిలుపునిచ్చారు. నిరుపేదల పక్షపాతిగా సీఎం జగన్ నిలిచారన్నారు. వైఎస్సార్ జగనన్న కాలనీల రూపంలో ఏకంగా పట్టణాలే నిర్మితమయ్యాయని కొనియాడారు. 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' పథకం కింద పెద్ద ఎత్తున గృహ నిర్మాణాలను చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం మౌలిక సదుపాయాల కల్పనకు శరవేగంగా చర్యలు చేపట్టిందన్నారు. నిర్మాణం పూర్తయిన ఇళ్లకు చకచకా విద్యుత్, నీటి సరఫరా కనెక్షన్లను అందచేసిందన్నారు. ఇళ్ల స్థలాల మ్యాపింగ్, జియో ట్యాగింగ్, రిజిస్ట్రేషన్, జాబ్ కార్డ్ అప్లికేషన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేసినట్టు వెల్లడించారు. నిరంతరం ప్రజల కోసం పరితపించే నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. తిరుపతి రూరల్ మండల పరిధిలోని 11,711 మంది లబ్ధిదారులకు బ్రాహ్మణపట్టు, కొత్తూరు, దుర్గసముద్రం, కొటాల, ఐతేపల్లి, తొండవాడ, సంజీవరాయపురం, నెన్నూరు, సీతారాంపురం, చిందేపల్లిలోని లేఅవుట్లలో ఇంటి స్థలాలు కేటాయించారన్నారు. నేడు ఒక్కో ఇంటి స్థలం విలువ రూ.10 లక్షలు ఉంటుందన్నారు. గత ప్రభుత్వాల కన్నా భిన్నంగా నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేటాయించిన ఇంటి స్థలాలకు ఎటువంటి ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేయించి ఇవ్వడం గొప్ప విషయంగా అభివర్ణించారు. సంక్షేమ ప్రభుత్వం కొనసాగాలంటే సీఎం జగనన్నను గెలిపించుకునేందుకు ప్రతి మహిళా సంకల్పించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తన యుడిగా, ప్రజలే తన కుటుంబ సభ్యులుగా ప్రజాసేవకు తరిస్తానని హామీ ఇచ్చారు. ఎంపీపీ వేముల యశోద, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, ఎంపీడీఓ రమేష్‌బాబు, తహసీల్దార్ మెహబూబ్ చాంద్ బీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



హాజరైన లబ్ధిదారులు

విజేతలకు రూ.20 లక్షలు




ప్రో కబడ్డీ విజేతలకు రూ.20 లక్షల చెక్కును అందజేస్తున్న మంత్రి ఆర్కే.రోజా

నాగలాపురం: ఆడుదాం ఆంధ్రా ప్రో కబడ్డీ పోటీల్లో రాష్ట్ర స్థాయిలో విజయం సాధించిన నాగలాపురం కబడ్డీ జట్టుకు చెందిన సుమన్, సతీష్‌కు ఒక్కొక్కరికీ రూ.10 లక్షల చొప్పున ఇద్దరికి రూ.20 లక్షల చెక్కును రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్కే.రోజా చేతులమీదుగా శుక్రవారం తమ నివాసంలో ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శ్యామ్, సచివాలయ కన్వీనర్ దేశప్పన్, వార్డు మెంబర్ ఉదయ్‌కుమార్, ఎంపీటీసీ రాజా పాల్గొన్నారు.

పకడ్బందీగా పది పరీక్షలు

- తిరుపతి జిల్లా వ్యాప్తంగా 162 పరీక్షా కేంద్రాలు
- హాజరుకానున్న 30,921 మంది విద్యార్థులు
- డీఈఓ డాక్టర్ వీ.శేఖర్



డాక్టర్ వీ శేఖర్, డీఈఓ, తిరుపతి

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈ నెల 18 నుంచి 30వ తేదీ వరకు పారదర్శకంగా నిర్వహించనున్నట్లు తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) డాక్టర్ వీ.శేఖర్ తెలిపారు. డీఈఓ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పది పబ్లిక్ పరీక్షలను తిరుపతి జిల్లా వ్యాప్తంగా 162 పరీక్షా కేంద్రాల్లో ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు ప్రశాంత వాతావరణంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షకు తిరుపతి జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ 27,012 మంది, ప్రైవేటు 3,909 మంది, మొత్తం 30,921మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నట్లు వెల్లడించారు. పరీక్షల కోసం 162 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 162 మంది డీఓలు, 1,666 మంది ఇన్విజిలేటర్లు, ఆరుగురు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలను నియమించినట్టు తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల సౌకర్యార్థం బల్లలు, తాగునీరు, అలాగే ఏఎన్‌ఎంలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా మూడు సమస్యాత్మక కేంద్రాలను గుర్తించామని, ఆ కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

మధ్యాహ్నం నుంచి ఓపెన్ స్కూల్

ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షలను అదే తేదీల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు జిల్లా వ్యాప్తంగా పదో తరగతికి 7, ఇంటర్ పరీక్షకు 13, మొత్తం 20 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించనున్నట్టు డీఈఓ తెలిపారు. పదో తరగతి పరీక్షకు రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 1,611 మంది, ఇంటర్ పరీక్షకు రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు 3,235 మంది, మొత్తం 4,846 మంది హాజరు కానున్నట్టు ఆయన వెల్లడించారు.

శాస్త్రోక్తంగా ఏకాంత సేవ



- ముగిసిన శివరాత్రి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరిరోజైన శుక్రవారం రాత్రి జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరునికి ఏకాంత సేవ నిర్వహించారు. ఈ ఉత్సవంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఉత్సవర్లను చిన్నపల్లకీలో స్వామివారి ఆవరణంలో నుంచి అమ్మవారి శయన మందిరానికి చేర్చారు. అనంతరం అక్కడ అమర్చిన పడక ఊయలలో స్వామి, అమ్మవార్లను ఉంచి ఊయల ఊపుతూ ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. ఆలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన



ప్రారంభిస్తున్న జిల్లా వినియోగదారుల కమిషన్ జడ్జి

తిరుపతి సిటీ : వినియోగదారుల హక్కులపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జిల్లా వినియోగదారుల కమిషన్ జడ్జి పార్థసారథి సూచించారు. శుక్రవారం ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం, జిల్లా వినియోగదారుల వ్యవహారాలశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రసంగించారు. టీటీడీ డీఈఓ ఎం.భాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపల్ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, కామర్స్ విభాగం హెడ్ వై.మల్లికార్జున్‌రావు, జిల్లా వినియోగదారుల మండలి అధ్యక్షులు పీ.రాజారెడ్డి, ఏఎస్ఓ రెడ్డి చంద్రిక, మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్షకు పటిష్ట ఏర్పాట్లు

తిరుపతి అర్బన్: ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని కలెక్టర్ లక్ష్మీశ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వాహణపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ జరగనున్న ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఉండాలని స్పష్టం చేశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్ -1, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పేపర్ -2 పరీక్షలు జరుగుతాయన్నారు. పేపర్ -1 పరీక్ష ఉదయం 9 నుంచి 9.45 గంటల వరకు, పేపర్ -2 పరీక్షకు మధ్యాహ్నం 1 నుంచి 1.45 వరకు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని స్పష్టం చేశారు. తిరుపతి నగరం, రూరల్ పరిధిలో మొత్తం 16 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా.. 9,377 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు తెలిపారు. 16 మంది లైజన్ ఆఫీసర్ లను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. అదనపు సమాచారం కోసం కంట్రోల్ రూమ్ నంబర్లు 9000665565, 9676928804లో సంప్రదించాలని ఆయన సూచించారు. ఆయన వెంట డీఆర్వో పెంచలకిషోర్, తిరుపతి ఆర్డీఓ నిశాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



పరీక్షల నిర్వహణపై ఆదేశాలు ఇస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

క్లుప్తంగా

ఎన్‌బీకేఆర్‌లో క్యాంపస్ ఇంటర్వ్యూలు

కోట : విద్యానగర్‌లోని నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన హుండయ్ మోటార్స్ ఇండియా సంస్థ క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించింది. బీటెక్ ఫైనలియర్ మెకానికల్ విభాగం విద్యార్థులు 74 మంది ఇంటర్వ్యూలకు హాజరు కాగా 14 మంది ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ కిషంధర్ తెలిపారు. కంపెనీ ప్రతినిధులు శ్యాంకుమార్, అవినాష్ ఇంటర్వ్యూలు చేశారు.

రూ.2 కోట్లతో రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న సర్పంచ్

సైదాపురం: కై వల్యా నది వంతెన నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు రూ.2 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం సర్పంచ్ వెందోటి శారద భూమి పూజ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎం రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ రోడ్డుకు నిధులు మంజూరు చేయించిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు చెప్పారు. సొసైటీ అధ్యక్షుడు శివకుమార్, వైస్ ఎంపీపీ తిరకాల భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ శివకుమార్, ఎంపీటీసీలు వెంకటరమణయ్య, పద్మ, నేతలు సాంబయ్య, సుధీర్, అనిల్, పెంచలయ్య, ఈశ్వరయ్య, సుబ్బయ్య, శంకరయ్య పాల్గొన్నారు.

పేదలందరికీ హక్కు పత్రాలు



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న వెంకటరత్నం

పెళ్లకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పేదలందరికీ ఇళ్ల స్థలాలు అందజేస్తున్నట్టు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఒబ్బు వెంకటరత్నం తెలిపారు. ఆయన శుక్రవారం చెంబేడు, నందిమాల గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ జగనన్న పాలనలో అర్హులందరికీ పథకాలు అందజేస్తున్నట్టు పేర్కొన్నారు. చెంబేడులో సిమెంట్ రోడ్లు ఏర్పాటు చేశామని తెలిపారు. సర్పంచ్‌లు ధర్మయ్య, వెంకటయ్య, వీఆర్వో రవిచంద్రబాబు, కార్యదర్శి శ్రీరామ్, నాయకులు రాఘయ్య, యాగయ్య, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి

పెళ్లకూరు: ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని తహసీల్దార్ ప్రసాద్‌రావు తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సాధారణ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత అన్ని ప్రాంతాల్లోనూ 144 సెక్షన్ అమలవుతందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో అన్నపూర్ణరావు, ఎస్‌ఐ శ్రీకాంత్ పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ



విద్యార్థులకు పరీక్షల సామగ్రి అందజేస్తున్న రోటరీ వెస్ట్ క్లబ్ ప్రతినిధులు

గూడూరు రూరల్ : మండలంలోని కొండాగుంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం రోటరీ వెస్ట్ క్లబ్ ఆధ్వర్యంలో రొటేరియన్ కృష్ణంరాజు పదో తరగతి విద్యార్థులకు పరీక్షల సామగ్రి అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు సనత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ మంచి మార్కులు సాధించిన విద్యార్థులకు క్లబ్ ద్వారా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు ధనుంజయరెడ్డి, రొటేరియన్ కృష్ణంరాజు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

రాపూరు: బాలింతలు, గర్భిణులు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజ్యలక్ష్మి, సౌజన్య, శారద తెలిపారు. రాపూరు మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం పోషకాహార పక్షోత్సవాలు నిర్వహించారు.

పౌష్టిహారంతోనే తల్లీబిడ్డలు క్షేమం

వెంకటగిరి (సైదాపురం): పౌష్టిహారంతోనే తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటారని వెంకటగిరి సీడీపీవో షంషాద్ బేగం తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని స్త్రీశక్తి భవనంలో శుక్రవారం పౌష్టికాహార పక్షోత్సవాలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 9 నుంచి 23వ తేదీ వరకు పోషణ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇప్పటి వరకు సరఫరా చేస్తున్న పాలు, గుడ్డు, రాగిపిండి, శనగచెక్కి, బెల్లం, బాలమృతంతోపాటు అదనంగా పాలు, కిలో అటుకులు, కిలో సజ్జ పిండి, కేజీ కర్జూరం పంపిణీ చేస్తున్నామన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త విజయశ్రీ మాట్లాడుతూ జంక్ ఫుడ్ పిల్లలకు పెట్టడం వల్ల వారి ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు.

వెంకటగిరి వాసులకు పుష్కలంగా తాగునీరు

- రూ.103 కోట్లతో ట్యాంకులు, పైపులైన్ల ఏర్పాటు
- శిలాఫలకాన్ని ఆవిష్కరించిన నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణ ప్రజలకు అమృత్ 2.0 పథకం ఇంద పుష్కలంగా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో రూ.92 కోట్లతో పట్టణ తాగునీటి సరఫరా అభివృద్ధి పథకం (అమృత్ 2.0), రూ.11 కోట్లతో బలహీన వర్గాల హౌసింగ్ కాలనీలో తాగునీటి వసతి కల్పనకు సంబంధించిన పనుల శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వెంకటగిరి పట్టణం రోజు రోజుకూ విస్తరిస్తోందన్నారు. ఈ క్రమంలో ప్రజలకు తాగునీరు సరఫరా చేసేందుకు ప్రభుత్వం రూ.103 కోట్లతో అమృత్ 2.0 పథకాన్ని మంజూరు చేసినటుట వివరించారు. ప్రస్తుతం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు సామర్థ్యాన్ని 5 మిలియన్ లీటర్ల నుంచి మరో 9 మిలియన్ లీటర్లకు పెంచుతున్నట్టు తెలిపారు. అలాగే ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మిస్తామన్నారు. సమ్మర్ ట్యాంక్ నుంచి డీఏ పైప్‌లైన్లను ఏర్పాటు చేసి మోటార్ల సామర్థ్యాన్ని పెంచుతామని చెప్పారు. పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటామని వివరించారు. ప్రజలకు ఇన్ని మంచి పనులు చేస్తున్న జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు.

అవాస్తవాలు ప్రసారం చేయడం దారుణం

వైఎస్సార్ సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వెంకటగిరి ప్రజలు రేణిగుంట విమానాశ్రయంలో కలిశారని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు మాట్లాడుతూ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డికి సీటు ఇస్తే తాము సహకరించబోమని మంత్రికి చెప్పినట్టు ఏబీఎన్ చానల్‌లో తప్పుడు కథనం ప్రసారం చేశారని తెలిపారు. దాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నటుట పేర్కొన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో ఏమి మాట్లాడారో తెలుసుకోకుండా తప్పుడు కథనం ప్రసారం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, పట్టణ కన్వీనర్ జి ఢిల్లీబాబు, వైస్ చైర్మన్‌లు ఎస్ బాలయ్య, చింతపట్ల ఉమామహేశ్వరి, విప్ పి.లక్ష్మి, కౌన్సిలర్లు ఆరి శంకరయ్య, ధనియాల రాధ, ఎంఏ నారాయణ, సుబ్బారావు, కళ్యాణి, మాడా జానకిరామయ్య, వహిదా, ఆటంబాకం శ్రీనివాసులు, నేతలు సిహెచ్ మురళీ, పులి ప్రసాద్‌రెడ్డి, వలికల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు



విందూరు వాటర్ వర్క్స్‌లో అధికారులు, నాయకులతో చర్చిస్తున్న మేరిగ మురళీధర్

గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ తెలిపారు. ఆయన శుక్రవారం స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ, పార్టీ సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డితో కలిసి గూడూరు సమీపంలోని విందూరు వాటర్ వర్క్స్‌ను పరిశీలించారు. పట్టణ ప్రజలకు రెండు పూటలా తాగునీటిని సరఫరా చేయాలంటే అన్ని బోర్లు పని చేసేలా చూడాలని అధికారులకు సూచించారు. ఆయన మాట్లాడుతూ విందూరు వాటర్ వర్క్స్‌ను వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజలకు రెండు పూటలా నీటిని అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పొనకా దేవసేనమ్మ, సీఈసీ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ విందూరు వాటర్ వర్క్స్‌లో బోర్లు మరమ్మతులు చేయించి నీటిని పంపింగ్ చేస్తే ఇబ్బందులు ఉండవని గుర్తించినట్లు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు కోడూరు మీరారెడ్డి, చేవూరు విజయ మోహన్‌రెడ్డి, పార్టీ పట్టణ, రూరల్ అధ్యక్షులు బొమ్మిడి శ్రీనివాసులు, మల్లు విజయకుమార్‌రెడ్డి, నాసిన నాగులు, తాళ్లూరు శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ కృష్ణప్రసాద్‌రెడ్డి, గోపాల్‌యాదవ్, కోదండరామయ్య, మురళి, ముని, సాయి, సుభాన్ పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమ పాలనకు మద్దతు ఇవ్వండి

వాకాడు : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అందరు తోడుగా నిలబడి మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త మేరిగ మురళీధర్ పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం వాకాడులో నిర్వహించిన వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన మహిళలకు నాలుగో విడత చేయూత చెక్కులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థికంగా ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతోందన్నారు. పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందాలంటే మరోసారి జగనన్న సీఎం కావాలన్నారు. ప్రభుత్వం ద్వారా మంచి జరిగి ఉంటేనే తనకు ఓటు వేయాలని సీఎం కోరుతున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రతి మహిళా ఆలోచించి మంచి చేసిన జగనన్నకు తోడుగా నిలవాలన్నారు. అనంతరం సీఎం చిత్ర పటానికి వాకాడు, చిట్టమూరు మండలాల మహిళలు, నాయకులు పాలాభిషేకం చేశారు. పార్టీ మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, వాకాడు ఏఎంసీ చైర్ పర్సన్ నాగభూషణమ్మ, జెడ్పీటీసీలు రౌతు రామక్రిష్ణ, చిప్పల వెంకటయ్య, నాయకులు కొడవలూరు దామోదరరెడ్డి, దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, కస్తూర్‌రెడ్డి, రాజారెడ్డి, పక్కీరయ్య, వైఎస్సార్ క్రాంతి పథం ఏసీ చంద్రబాబు, వాకాడు, చిట్టమూరు మండలాల ఏపీఎంలు మాధవి, ఉమాదేవి పాల్గొన్నారు.

సీఎం జగనన్నను మరోసారి ఆశీర్వదించండి

చిల్లకూరు : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ముఖ్యమంతి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అనేక పథకాలు అమలుచేస్తున్నారని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో శుక్రవారం మండలంలోని 3,868 మంది మహిళలకు రూ.7.25 కోట్ల వైఎస్సార్ చేయూత చెక్కు అందజేశారు. ఆయన మాట్లాడుతూ చేసిన మంచిని గుర్తించి మరోసారి సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. అనంతరం మహిళలు సీఎం చిత్ర పటానికి పాలాబిషేకం చేశారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంలో వినియోగించే వస్తువులను ఉచితంగా అందించారు. కార్యక్రమంలో గూడూరు ఏఎంసీ చైర్ పర్సన్ ఓడూరు యమునమ్మ, కమ్మవారిపాళెం, తిమ్మనగారిపాళెం, ఓడూరు గ్రామాల సర్పంచ్‌లు నారాయణ, సుమలత, శారదమ్మ, నాయకులు యల్లంటి సనత్‌కుమార్‌రెడ్డి, కట్టా రవీంద్రరెడ్డి, కనపర్తి దిలీప్‌రెడ్డి, ఇస్మాయిల్, కొట్టు అశోక్, మల్లి శ్రీనివాసులు, యనమల అనుదీప్, ఎంపీడీవో భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



వాకాడు : సీఎం చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు



చిట్టమూరు : మహిళలకు చెక్కు అందజేస్తున్న మేరిగ మురళీధర్

కలిసికట్టుగా పని చేద్దాం

గూడూరు రూరల్ : గూడూరు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేయాలని పరిశీలకులు ఎంఆర్‌సీరెడ్డి పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం సనత్‌నగర్‌లో ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ నివాసంలో పట్టణ, రూరల్ ప్రాంతాలకు చెందిన నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి వారు పొందిన లబ్ధిని వివరించాలని కోరారు. స్థానికంగా ఉండే నాయకులు ప్రతి ఇంటికీ వెళ్లి పార్టీ చేసిన మంచిని తెలియజేయాలన్నారు. సమావేశంలో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ, సీఈసీ సభ్యులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, ఎంపీపీ గురవయ్య, వైస్ ఎంపీపీ శ్రీనివాసులురెడ్డి, పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ కోడూరు కల్పలత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ మండలి సభ్యుడిగా చిందేపల్లి



పెళ్లకూరు: రాష్ట్ర ఉపాధి హామీ మండలి నాన్ అఫిషియల్ మెంబర్‌గా(ఏపీఎస్‌ఈజీసీ) వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి, నగరి నియోజకవర్గ పరిశీలకులు చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారి నుంచి ఉత్తర్వులు అందుకున్నారు. పార్టీలో కష్టపడి పని చేసే వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంచి గుర్తింపు కల్పిస్తారని చెప్పారు. రాష్ట్ర ఉపాధి హామీ మండలి సభ్యుడిగా నియమించడానికి సహకరించిన మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీలు మిథున్‌రెడ్డి, గురుమూర్తి, ఎమ్మెల్యేలు బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి పనిచేస్తానన్నారు.

నేడు అంబేడ్కర్ భవన్ ప్రారంభం

నాయుడుపేట టౌన్ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు కూడలి ప్రాంతంలో సుమారు రూ.60 లక్షలతో నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌ను శనివారం ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రారంభిస్తారని మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక తెలిపారు. ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని మున్సిపాలిటీ నిధులతో పాటు ప్రత్యేక నిధులు కేటాయించి పునః నిర్మాణం చేపట్టినట్టు తెలిపారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి

చిట్టమూరు(చిల్లకూరు) : ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన తరువాత ప్రతి అధికారీ చిత్త శుద్ధితో పని చేయాలని తహసీల్దార్ శ్రీనివాసశర్మ సూచించారు. ఆయన శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బీఎల్‌వోలు, రెవెన్యూ, మండల పరిషత్, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికలకు సర్వ సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు. కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే ప్రతి గ్రామంలో రాజకీయ నాయకులు, జాతీయ నాయకుల విగ్రహాలు ఉంటే వాటికి ముసుగులు వేయాలన్నారు. రాజకీయ నాయకుల ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. ఎక్కడా కూడా ఎన్నికల నియమావళిని అధిగమించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షలో డీఎల్‌డీవో వాణి, ఎంపీడీవో నాగరాజు, ఎస్‌ఐ బలరామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

వెంకటగిరి రూరల్ : వెంకటగిరి పట్టణంలోని పాల కేంద్రం వద్ద ఉన్న 132 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్టు డీఈఈ ముని రవిచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటగిరి పట్టణం, వెంకటగిరి రూరల్, డక్కిలి, బాలాయపల్లి మండలాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎంపీని కలిసిన డీసీసీబీ చైర్మన్



పెళ్లకూరు: ఎంపీ విజయసాయి రెడ్డిని శుక్రవారం డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. విజయసాయిరెడ్డికి శాలువా కప్పి సన్మానించారు. ఆయన వెంట ఎమ్మెల్సీ బీదా మస్తాన్‌రావు ఉన్నారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం

దొరవారిసత్రం : తనియాలిలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 300 మందికి పైగా రోగులకు వైద్యులు వైద్య సేవలు అందించారు. కార్యక్రమాన్ని ఎంపీడీవో శివరాజు, ఏవో రఘురామయ్య పర్యవేక్షించారు. డాక్టర్లు చంద్రకళ, రూప, అమరనాథ్, లలిత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మునికృష్ణ పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చిన సీఎం



మహిళలకు పట్టాలు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ యామిని

గూడూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంత ఇంటి కలను నెరవేర్చారని గూడూరు జెడ్పీటీసీ ఊటుకూరు యామిని తెలిపారు. ఆమె శుక్రవారం గూడూరు రూరల్ మండలంలోని పేదలకు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని తెలిపారు. ఆయనను మరోసారి సీఎంగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. తహసీల్దార్ కరుణబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగనన్న ధ్యేయం



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య
- రూ.52 లక్షల సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

నాయుడుపేట టౌన్ : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. ఆయన శుక్రవారం నాయుడుపేటలోని తన క్యాంపు కార్యాలయంలో మండలాలకు చెందిన 65 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.52 లక్షల చెక్కులు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు కార్పొరేట్ వైద్యసేవలు అందించాలన్న లక్ష్యంతో ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారని పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్యశాలలను నాడు–నేడు కింద అభివృద్ధి చేసినట్టు చెప్పారు. నాయుడుపేట, సూళ్లూరుపేట పట్టణాల్లో సుమారు రూ.11 కోట్లతో 50 పడకల వైద్యశాలలు, రూ.4 కోట్లకు పైగా నిధులతో వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించినట్టు వివరించారు. ప్రతి పేదవాడినీ ఆదుకుంటున్న సీఎం జగనన్నను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మీ, ఈదా రత్నశ్రీ, నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు చదలవాడ కుమార్, కిషోర్ యాదవ్, కరింబాయి చెంచయ్య, గంధవల్లి సిద్దయ్య, జరుగుమల్లి బాబురెడ్డి, పొట్లాపూడి రాజేష్, దారా రవి తదితరులు పాల్గొన్నారు.



కుమార్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తదితరులు

సీఎం జగనన్నను ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలి

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కోరారు. ఆయన వైఎస్సార్‌సీపీతోపాటు ఇతర పార్టీల నాయకులను కలిసి ఎన్నికల్లో జగనన్నకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం వైఎస్సార్ సీపీ నాయకుడు డాక్టర్ వెడిచర్ల ప్రద్యుమ్న కుమార్ రెడ్డి, టీడీపీ నాయకుడు గూడూరు సుధీర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గూడూరు ప్రభావతమ్మ తదితర నాయకుల ఇళ్లకు వెళ్లి వైఎస్సార్ సీని ఆదరించాలని కోరారు. నాయకులు బైనా మల్లికార్జున రెడ్డి, కటకం జయరామయ్య, కిషోర్ యాదవ్, చంద్రా రెడ్డి, మెస్ భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సాగరమాల రోడ్డుకు భూసేకరణ పూర్తి



ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

నాయుడుపేట: విశాఖ– చెన్నై కారిడార్‌లో భాగంగా నాయుడుపేట– కృష్ణపట్నం పోర్టు వరకు సాగరమాల రోడ్డుకు దాదాపు భూసేకరణ పూర్తయినట్టు ఆర్డీవో ఆర్ చంద్రముని తెలిపారు. ఆయన శుక్రవారం నాయుడుపేట తహసీల్దార్ కార్యాలయంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాగరమాల రోడ్డు భూసేకరణపై సమస్యలు వుంటే నేరుగా వచ్చి తెలపాలన్నారు. రెవెన్యూ రికార్డులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సాగరమాల రహదారిలో సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేస్తే రైతులకు అనువుగా వుంటుదని పుదూరు గ్రామానికి చెందిన కొందరు రైతులు వినతి పత్రం అందించారు. ఆర్డీవో మీడియాతో మాట్లాడుతూ సాగరమాల రహదారికి రైతుల నుంచి భూసేకరణ చేపట్టామన్నారు. దాదాపుగా 90 శాతం మంది రైతులకు పరిహారం చెల్లించామని వివరించారు. పెండింగ్‌లో వున్న వారికి రికార్డులను పరిశీలించి అందించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. నాయుడుపేట మండల తహసీల్దార్ కళ్యాణి, డీటీ రాజేంద్ర, భూసేకరణ అధికారులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బల్లవోలులో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

చిల్లకూరు : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తిని తీర్చేందుకు బల్లవోలులోని బస్టాండ్‌లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకుడు మారంరెడ్డి అమరనాథ్‌రెడ్డి చేతుల మీదుగా చలివేంద్రం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన యువకులు మాట్లాడుతూ అమరనాథ్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని బల్లవోలు, వేళ్లపాళెం పంచాయతీల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. తూర్పుకనుపూరులో జరిగే జాతరకు లక్షలాదిగా వచ్చే భక్తులకు చలివేంద్రం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం 58 కేజీల కేక్‌ను కట్ చేసి పంచి పెట్టారు. నాయకులు దువ్వూరు కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేలు చేసిన వారిని ఆదరించండి

కలువాయి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదలకు ఎనలేని మేలు చేస్తున్నారని, ఆయనను మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని కలువాయి జెడ్పీటీసీ బి.అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. కలువాయి ఉమామహేశ్వరి కల్యాణ మండపంలో శుక్రవారం 2382 మంది లబ్ధిదారులకు రూ.47 కోట్ల నాలుగో విడత వైఎస్ఆర్ చేయూత చెక్కు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నవరత్నాలు పథకాల ద్వారా ప్రతి కుటుంబానికీ రూ.లక్షల లబ్ధి కలిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని మరోసారి ఆదరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్ లక్ష్మీదేవి, పార్టీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మాదాసు యజ్ఞపవన్, తిరుపతి జిల్లా పార్టీ కమిటీ సభ్యులు పి.కృష్ణయ్య, ఎంపీటీసీ విజయమ్మ, కోఆప్షన్ సభ్యులు షేక్ రఫీ, ఎంపీడీవో ప్రభాకర్, వెలుగు ఏపీఎం సారా స్రవంతి పాల్గొన్నారు.



చేయూత చెక్కు అందజేస్తున్న జెడ్పీటీసీ

ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్ పరామర్శ

పెళ్లకూరు : ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి శుక్రవారం రావులపాడు సర్పంచ్ గంజి మాతయ్య, వైస్ ఎంపీపీ ఇలక సుధారాణి తల్లి ఇలక రత్నమ్మను పరామర్శించారు. మాతయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి నెల్లూరులో చికిత్స పొందుతున్నారు. అలాగే రత్నమ్మ అనారోగ్యంతో బాధపడుతూ నెల్లూరు అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సంజీవయ్య, డీసీసీబీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి బాధితులను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

రాపూరు: ఆర్టీసీ రాపూరు డిపోలో శనివారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు మేనేజర్ అనిల్ కుమార్ తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై ఉదయం 11 గంటల నుంచి 12 వరకు 9959225651 నంబర్‌కు ఫోన్‌చేసి చెప్పవచ్చని సూచించారు.

ఈ క్రాప్ పంట నమోదు ధ్రువీకరణ పత్రాలు అందజేత

డక్కిలి : మండలంలోని రైతులకు ఈ క్రాప్ బుకింగ్ ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేసినట్లు ఏవో విజయభారతి తెలిపారు. ఆమె శుక్రవారం లింగసముద్రం రైతు భరోసా కేంద్రంలో రైతులకు ఈ క్రాప్ బుకింగ్ పత్రాలు అందజేశారు. మండలంలో 2667 మంది రైతులు 6,015 ఎకరాల్లో పంటలు సాగుచేశారని తెలిపారు. అభ్యంతరాలను సవరించి తుది జాబితా ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

బాలాయపల్లిలో....

బాలాయపల్లి మండలంలో 2,661 మంది రైతులకు రబీ సీజన్‌లో 6,838 ఎకరాల్లో పంటలు సాగు చేసినట్టు ఏవో శిరీష తెలిపారు. వారికి ఈ క్రాప్ బుకింగ్ పత్రాలు అందజేసినట్టు పేర్కొన్నారు.

దొరవారిసత్రంలో..

దొరవారిసత్రం : మండలంలోని 11 ఆర్బీకేల్లో శుక్రవారం రైతులకు ఈ క్రాప్ నమోదు పత్రాలు అందజేసినట్టు ఏవో జ్యోతిర్మయి తెలిపారు. ఈ రబీ సీజన్‌లో 2023–24 గాను 4,660 మంది రైతులు 1,200 ఎకరాల్లో వరి పంట సాగు చేసినట్టు పేర్కొన్నారు.



డక్కిలి: రైతులకు పత్రాలను అందజేస్తున్న ఏవో విజయభారతి

వాకాడులో..

వాకాడు : మండలంలోని రైతులకు ఈ క్రాప్ నమోదు పత్రాలు అందజేస్తున్నట్టు వ్యవసాయ శాఖాధికారిణి దీప తెలిపారు. ఆమె శుక్రవారం వాకాడులో మాట్లాడుతూ మండలంలో 2036 మంది రైతులు 10,400 వేల ఎకరాల్లో సాగు చేసిన పంటలను నమోదు చేసినట్టు చెప్పారు. వీటిపై అభ్యంతరాలు ఉంటే వాటిని ఈ నెల 13 నుంచి రెండు రోజులు పాటు ప్రత్యేక సభల ద్వారా సరిచేస్తామన్నారు.



దొరవారిసత్రం : ఉచ్చూరు ఆర్బీకేలో పంట నమోదు పత్రాలు పొందిన రైతులు